సాక్షి నిర్మల్

ఆదివారం । 12 । మే । 2024



నిస్వార్థ సేవకులు

ఆస్పత్రిలో రోగులకు వైద్యసేవలు అందించే నిస్వార్థ సేవకులు నర్సులు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం. 2లో▸



మమతల తల్లీ...

'అమ్మ' తన ఆయుష్షును తనయుల కోసమే దారబోస్తుంది. నేడు 'అంతర్జాతీయ మాతృ దినోత్సవం' సందర్భంగా కథనం. 2లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.4 /26.6

ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌చైన్‌గేట్: పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పాల్గొనే నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అధికారులకు నియమ నిబంధనలపై శనివారం అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా నిర్వహించే అన్నిరకాల రిజిస్టర్లు, ఫారాల గురించి తెలియజేశారు. ఆదివారం ఉదయం ఈవీఎంల పంపిణీ కేంద్రానికి వచ్చి అన్నిరకాల ప్రక్రియలు పూర్తిచేసి మధ్యాహ్నం పోలింగ్ కేంద్రాలకు బయలుదేరాలని ఆదేశించారు. పోలింగ్ జరిగే సమయంలో నిర్దేశించిన డేటా ఎంట్రీ యాప్‌లో పోలింగ్ శాతానికి సంబంధించిన వివరాలు పంపాలన్నారు. ఈవీఎం యంత్రాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తి పోలింగ్ నిలిచిపోతే పోలింగ్‌ను తిరిగి త్వరితగతిన ప్రారంభించేందుకు అన్ని చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు, సిబ్బందికి ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఆర్డీవో రత్నకళ్యాణి, మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు, ఎంపీడీవోలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొంటాం



తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

ఖానాపూర్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి కొనుగోలు కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ కిషోర్‌బాబు శనివారం సందర్శించారు. ఇటీవల కురిసిన అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను విన్నవించారు. కొనుగోలు కేంద్రం నిర్వహణ సక్రమంగా లేదని, నిర్వాహకులు పట్టించుకోవడం లేదని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో ఆశన్నతోపాటు రైతులు పాల్గొన్నారు.

గద్దర్ కూతురి వాహనం తనిఖీ

ఖానాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఇన్‌చార్జి రవీందర్ ఆధ్వర్యంలో మండలంలో ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఖానాపూర్-కడెం రోడ్డుపై పాత ఎల్లాపూర్ వద్ద గద్దర్ కూతురు వెన్నెలతో పాటు బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుక్యా జాన్సన్‌నాయక్ తదితరుల వాహనాలను తనిఖీ చేశారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ



పోలింగ్ కేంద్రంలో సూచనలిస్తున్న ఎస్పీ

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ జానకీషర్మిల శనివారం పరిశీలించారు. కేంద్రాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు శాంతియుత వాతవరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎస్పీ వెంట సీఐ సైదారావు, ఎస్సై లింబాద్రి ఉన్నారు.

రేపే యుద్ధం.. సర్వం సిద్ధం

- జిల్లాలో 926 పోలింగ్ కేంద్రాలు..
- అందులో సమస్యాత్మకం.. 149
- జిల్లాలో ఓటర్ల సంఖ్య..7,37,416
- సన్నద్ధమవుతున్న పోలింగ్ సిబ్బంది
- నేడు నియోజకవర్గకేంద్రాల్లో 'సామగ్రి' పంపిణీ

వివరాలు:

మొత్తం ఓటర్లు: 7,37,416
పురుషులు: 3,55,259
మహిళలు: 3,82,107
ఇతరులు: 50
పంపిణీ/స్వీకరణ కేంద్రాలు : 03
(ముధోల్, నిర్మల్, ఉట్నూర్)
మొత్తం పోలింగ్ కేంద్రాలు: 926
(నిర్మల్:306 ముధోల్:311 ఖానాపూర్ :309)
సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు: 149
మహిళా పోలింగ్ కేంద్రాలు : 03
మోడల్ పోలింగ్ కేంద్రాలు : 03
పీఓ, ఏపీఓ, ఓపీఓలు : 4,436
మైక్రో అబ్జర్వర్లు : 106



అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పంపిణీ కేంద్రాల వద్ద సిబ్బంది

నిర్మల్: ఢిల్లీ పీఠం కోసం జరుగుతున్న పార్లమెంట్ పోరులో ప్రచారపర్వం శనివారం సాయంత్రంతో ముగిసింది. సోమవారం నిర్వహించే ఓట్లపండుగకు ఆదివారం ఉదయం నుంచే అసలు కథ మొదలవుతోంది. పార్టీలు, అభ్యర్థులు జోరుగా తిరగడం , ప్రచారాన్ని హోరెత్తించడం ఒకెత్తయితే.. ఆదివారం, సోమవారం ఈ రెండురోజులపాటు ఓపికతో, ప్రశాంతంగా ఎన్నికల సిబ్బంది పనిచేయడం మరో ఎత్తు. అభ్యర్థులు, నాయకులు విజయం కోసం శ్రమిస్తే.. అధికారులు, సిబ్బంది ఎన్నికలు విజయవంతంగా పూర్తిచేసేందుకు రెండు రోజులు నిర్విరామంగా పనిచేస్తారు. ఎన్నికల నిర్వహణకు కావాల్సిన పోలింగ్ సామగ్రిని, ఈవీఎంలను అందించడానికి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇప్పటికే పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

926 పోలింగ్ కేంద్రాలు..

లోక్‌సభ ఎన్నికల కోసం జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 926 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 149 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఇక్కడ పీవో, ఏపీవో, ఓపీవోలతోపాటు అదనంగా 106 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. అదనపు పోలీసు బలగాల పర్యవేక్షణ కూడా ఉండనుంది. ప్రతీ పోలింగ్ కేంద్రంలో వంద శాతం వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నారు.

7,37,416 మంది ఓటర్లు..

జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 7,37,416 మంది ఓటర్లు ఉన్నారు. మహిళా ఓటర్లు 3,82,107 మంది, పురుషులు 3,55,259 మంది, ఇతరులు 50 మంది ఉన్నారు. జిల్లాలో పురుషుల కంటే 26,848 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు.

నేడు పోలింగ్ సామగ్రి పంపిణీ..

జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఆదివారం ఉదయం నుంచే పోలింగ్ సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేశారు. నిర్మల్ నియోజకవర్గానికి సంబంధించి స్థానిక ఎన్టీఆర్ మినీస్టేడియంలో, ముధోల్‌లో గురుకుల విద్యాలయంలో, ఖానాపూర్ నియోజకవర్గానికి సంబంధించి ఉట్నూరు కేబీకాంప్లెక్స్‌లో పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గత ఎన్నికల్లో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈసారి పోలింగ్ సామగ్రినంతా ఒకే బ్యాగ్‌లో పెట్టి సిబ్బందికి అందించే ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గాల వారీగా ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను పంపిణీకి సిద్ధం చేశారు.

రెండురోజులు.. నిర్విరామంగా..

జిల్లాలో మొత్తం 1,109 మంది చొప్పున పీవోలు, ఏపీవోలు, 2,218 ఓపీఓలు ఉన్నారు. వీరంతా ఆదివారం ఉదయం కచ్చితంగా తమకు కేటాయించిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ ఆదేశించారు. ఇక ఈ ఎన్నికల యుద్ధాన్ని ప్రశాంతంగా నిర్వహిస్తూ.. విజయవంతంగా పూర్తిచేసే బాధ్యత పోలింగ్ సిబ్బందిపైనే ఉంటుంది. వీరంతా ఆదివారం సామగ్రి తీసుకోవడం, పరిశీలన చేసుకోవడం, అనంతరం తమ బృందంతో కలిసి పోలింగ్ కేంద్రాలకు వెళ్లడం, అక్కడ ఏ రాత్రయినా.. ఏర్పాట్లు చేసుకోవడం చేయాల్సి ఉంటుంది. సోమవారం ఉదయం 5 గంటలకే మాక్‌పోలింగ్ చేపట్టాలి. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్‌ను సజావుగా పూర్తిచేయాల్సి ఉంటుంది. అనంతరం అన్నీ సరిచూసుకుని మళ్లీ ఈవీఎంలతో పాటు పోలింగ్ సామగ్రిని తిరిగి కేంద్రాల్లో అప్పజెప్పాలి. ఏరాత్రయినా.. ఓపికతో ఈ పనులన్నీ పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇందుకోసం సిబ్బంది కూడా మానసికంగా సన్నద్ధమవుతున్నారు.

ప్రశాంతంగా పూర్తిచేసేలా..



జిల్లాలో లోక్‌సభ ఎన్నికలనూ సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశాం. ఈ ఎన్నికలను ప్రశాంతంగా పూర్తిచేసేందుకు జిల్లా ప్రజలూ సహకరించాలి. ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి.

–ఆశిష్‌సంగ్వాన్, కలెక్టర్

పకడ్బందీగా బందోబస్తు..



జిల్లా మొత్తం ఇప్పటికే పోలీసుల రక్షణ వలయంలో ఉంది. జిల్లా అంతటా పోలీసు బలగాలను సిద్ధం చేశాం. పోలింగ్ ప్రక్రియకు ఎక్కడా ఎలాంటి ఆటంకం కలుగకుండా పోలీసులను మోహరిస్తున్నాం. ప్రజలు కూడా ప్రశాంత పోలింగ్‌కు సహకరించాలని కోరుతున్నాం.

–జానకీషర్మిల, ఎస్పీ

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల/నర్సాపూర్(జి): లోకసభ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని డీపీవో శ్రీనివాస్ సూచించారు. కుంటాల మండలం అంబకంటి, కుంటాల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను, నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని 299, 300, 303, బమ్ని(బి) గ్రామంలోని 79 పోలింగ్ కేంద్రాన్ని శనివారం సందర్శించారు. విద్యుత్, తాగు నీరు, మూత్ర శాలలు, ర్యాంప్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో రహీం, పంచాయతీ కార్యదర్శులు ఉత్తం, రాజబాపు, రమ్య, వీణారెడ్డి, గంగాజల ఉన్నారు.

అసత్య ప్రచారం చేయొద్దు

- ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్: సమాజంలో అలజడి సృష్టించేందుకు అసత్య ప్రచారం చేయొద్దని, ఎవరైనా అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ జానకీషర్మిల హెచ్చరించారు. ఈనెల 9న బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భైంసాలో నిర్వహించిన రోడ్ షోలో కొందరు ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపినట్లు చెప్పారు. కేటీఆర్ వెళ్లిపోయిన తర్వాత జన సమూహంలో ఇద్దరిపై కర్రలతో, ప్లకార్డుకు ఉన్న ఇనుప రాడ్లతో దాడి జరిగిందని పేర్కొన్నారు. ఒక వ్యక్తికి తీవ్రమైన రక్తస్రావం కావడంతో ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. గాయపడిన వ్యక్తి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భైంసా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. సీసీటీవీ పుటేజీల ఆధారంగా దాడి చేసిన వ్యక్తులను గుర్తించి 23 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. దాడి చేసిన వారిలో హనుమాన్ మాలధారులు ఉన్నట్లు తెలిపారు. దీనిపై అసత్య ప్రచారం చేయొద్దని సూచించారు. కేటీఆర్ పై దాడి చేయడంతో అరెస్టు చేసినట్లు కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్/కడెం: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులు గెలిస్తేనే రాష్ట్రంతోపాటు దేశం అభివృద్ధి చెందుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో, కడెం మండలం అంబారిపేట్ గ్రామం నుంచి పాండ్వపూర్, కొండుకూర్, కడెం మీదుగా ఖానాపూర్ వరకు బైక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలిసి శనివారం ర్యాలీ, రోడ్‌షో నిర్వహించారు. బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. రాజ్యాంగం పరిరక్షించాలన్నా, రిజర్వేషన్లను కాపాడుకోవాలన్నా కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించి,రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలన్నారు. అంతకుముందు క్యాంపు కార్యాలయంలో మండలంలోని గోసంపల్లె పంచాయతీ పరిధిలో గల నడింపల్లె గ్రామానికి చిప్ప దేవన్నతోపాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో కడెం మండల అధ్యక్షుడు మల్లేశ్, యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుర్గాభవాని, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, నాయకులు భూషణ్, వెంకటేశ్, శంకర్, లచ్చన్న, చిన్నం సత్యం, దయానంద్, నిమ్మల రమేశ్, షబ్బీర్‌పాషా, కావలి సంతోష్, శంకర్, సత్యం, వెంకాగౌడ్, రాజేందర్, రాజేశ్వర్, శ్రీనివాస్, గంగాధర్, గంగనర్సయ్య, అమానుల్లా ఖాన్, సత్యనారాయణ, సురేశ్, సచిన్, జహీర్ అహ్మద్, లక్ష్మీపతి, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతో భరోసా

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



కూలీలతో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

సారంగాపూర్: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే అందరూ భరోసాగా ఉంటారని, నిరుపేదల బతుకులు బాగుపడతాయని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మళ్లీ కష్టాలు తప్పవని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని స్వర్ణ గ్రామంలో శనివారం ఉపాధిహామీ కూలీలను కలిసి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. పదేళ్ల అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసిందని అన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే దేశాన్ని మరింత అభివృద్ధి చేస్తారని పేర్కొన్నారు. బీజేపీ కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి ఎంపీగా గోడం నగేశ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గంగారెడ్డి, రాజేందర్‌రెడ్డి, అబ్దుల్ హదీ, విలాస్, తిరుమల చారి, చెన్న రాజేశ్వర్, రాంశంకర్‌రెడ్డి, మధు, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్

- కేంద్రాల వారీగా కేటాయింపు
- పార్లమెంట్ పరిధిలో 10,548 మందికి విధులు



ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న పరిశీలకులు రాజేంద్ర విజయ్ తదితరులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించే పీవో, ఏపీవో, ఓపీవోలు, మైక్రోఅబ్జర్వర్స్ లోకేషన్ చివరి ర్యాండమైజేషన్ ప్రక్రియ శనివారం చేపట్టారు. సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్, రిటర్నింగ్ అధికారి రాజర్షి షా, ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే , నిర్మల్ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ సమక్షంలో ఆన్‌లైన్‌లో ఈ ప్రక్రియ పూర్తి చేశారు. పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 2,200 పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించేలా ఈ కేటాయింపులు చేశారు. 2,637 మంది పీవోవోలు, 2,637 మంది ఏపీవోలు, 5,274 మంది ఓపీవోల చొప్పున మొత్తం 10,548 మందిని ఆ యా నియోజకవర్గాలకు నియమించారు. ఇందులో ఆదిలాబాద్ నియోజకవర్గానికి 1,400 మందిని కేటాయించగా, బోథ్ నియోజకవర్గానికి 1,468, ఆసిఫాబాద్‌కు 1,708, సిర్పూర్‌కు 1,536, నిర్మల్‌కు 1,468, ఖానాపూర్‌కు 1,476, ముథోల్‌కు 1,492 మందిని కేటాయించారు. కార్యక్రమంలో మూడు జిల్లాల ఎన్నికల అధికారులు, ఈడీఎంలు పాల్గొన్నారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వివరాలు..

నియోజకవర్గం	పోలింగ్‌కేంద్రాలు	పీవోలు	ఏపీవోలు	ఓపీవోలు
ఆదిలాబాద్	292	350	350	700
బోథ్	306	367	367	734
ఆసిఫాబాద్	356	427	427	854
సిర్పూర్	320	384	384	768
నిర్మల్	306	367	367	734
ఖానాపూర్	309	369	369	738
ముధోల్	311	373	373	746

క్లుప్తంగా

అప్పాలు చేసి... ఓట్లు అభ్యర్థించి



కప్పర్లలో అప్పాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తాంసి: ఎన్నికల ప్రచార సమయం ముగుస్తున్న తరుణంలో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి నాయకులు వినూత్నంగా ప్రచారాలు చేపడుతున్నారు. శనివారం తాంసి మండలంలోని కప్పర్లలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అప్పాలు చేస్తున్న మహిళల వద్దకు వెళ్లి వారితో కలిసి అప్పాలు చేస్తూ ఎన్నికల్లో ఆత్రం సక్కును గెలిపించాలని అభ్యర్థించారు.

హోటల్‌లో లీకైన గ్యాస్ సిలిండర్

బోథ్: మండల కేంద్రంలోని ఓ హోటల్‌లో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగాయి. హోటల్‌లో సిలిండర్ పైపు నుంచి గ్యాస్ లీక్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న సామగ్రికి మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు నీటితో మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో దాదాపు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు నిర్వాహకులు తెలిపారు.

అనుమానాస్పదంగా ఆరు ఆవులు మృతి



మృతి చెందిన ఆవులు

నార్నూర్: మండలంలోని మహాగావ్ సమీపంలో మేతకు వెళ్లిన ఆరు ఆవులు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు శనివారం ఉదయం గ్రామ సమీపంలో ఉన్న చేనులో మేతకు వెళ్లిన ఆవులు అకస్మాత్తుగా అక్కడికక్కడే మృతి చెందాయి. గ్రామానికి చెందిన జాదవ్ రోహిదాస్‌కు చెందిన ఒకటి, తొడసం లింగుకు చెందిన రెండు, ఆత్రం లచ్చుకు చెందిన రెండు, రమేశ్ జాడేకు చెందిన ఒక్క ఆవు ఉన్నాయి. ఒకేసారి ఆరు ఆవులు మృతి చెందడంపై గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతి చెందిన ఆవుల విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని, పశువైద్యాధికారి పంచనామా నిర్వహించి బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యంతో అధికారులు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్డులో శనివారం అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ టీం పట్టుకున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రమేశ్ తెలిపారు. ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా కొడేకర్ సత్యనారాయణ అనే వ్యక్తి శ్యాంపూర్‌కు మద్యం తరలిస్తూ పట్టుబడ్డాడు. పట్టుకున్న మద్యం విలువ రూ.24,400 ఉంటుందన్నారు. నిందితునిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



నిస్వార్థ సేవకులు

- రోగులకు నిరంతర వైద్యసేవలు
- నర్సింగ్ ఆఫీసర్లుగా గుర్తింపు
- నేడు అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

నిర్మల్‌చైన్‌గేట్: ఒంటిపై తెల్లని దుస్తులు ధరించి తలకు చిన్నటోపీ పెట్టుకుని చెరగని చిరునవ్వుతో ఆప్యాయమైన పలకరింపుతో ఆస్పత్రిలో రోగులకు వైద్యసేవలు అందించే నిస్వార్థ సేవకులు నర్సులు. రోగులకు తల్లిలా.. సోదరిలా సపర్యలు చేసే మానవతామూర్తులు. రోడ్డు ప్రమాద క్షతగాత్రులైనా.. పురిటినొప్పులతో వచ్చే గర్భిణులైనా.. ఇతర అనారోగ్య కారణాలతో ఆస్పత్రికి వచ్చే రోగులను మొదట తోబుట్టువులా పలకరిస్తారు. ఆస్పత్రిలో ఉన్నన్ని రోజులు వైద్యసేవలు అందిస్తారు. ప్రపంచాన్నే అతలాకుతలం చేసిన కరోనాను కట్టడి చేయడంలో నర్సుల పాత్ర అమోఘం. తమ ప్రాణాలుసైతం లెక్కచేయకుండా రోజుల తరబడి కుటుంబ సభ్యులకు దూరంగా ఉండి వారు అందించిన సేవలు మరువలేనివి. రోగుల మనోభారం దూరంచేసే ప్రాణదాతలకు స్వరాష్ట్రంలోనే గౌరవం దక్కింది. నర్సింగ్ ఆఫీసర్లుగా గుర్తించి, అదే హోదాతో పిలవాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించింది. నర్సింగ్ వృత్తికి హుందాతనం తెచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రపంచ దేశాలన్నీ మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

అవార్డుతో బాధ్యత పెరిగింది



2022లో అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా ఉత్తమ నర్స్ అవార్డు అందుకోవడం మరింత బాధ్యత పెంచింది. 23 సంవత్సరాలు ప్రసూతి విభాగంలో పనిచేశా. ఈ వృత్తి ఆనందంగా ఉంది.

– అపర్ణ, హెడ్‌నర్స్, జిల్లా జనరల్ ఆస్పత్రి, నిర్మల్

వైద్యంతో పాటు ధైర్యం చెబుతున్నాం



దవాఖానలో చికిత్స కోసం వస్తున్న రోగులకు వైద్యంతో పాటు మనోధైర్యాన్ని కల్పిస్తున్నాం. మా కుటుంబ సభ్యుల్లాగా ఆదరిస్తూ భరోసా కల్పిస్తున్నాం. నేను ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఎంతో మంది ప్రాణాలను కాపాడామన్న తృప్తి ఉంది.

– విజయలక్ష్మి, నర్సింగ్ సూపరింటెండెంట్, జనరల్ ఆస్పత్రి, నిర్మల్

ప్రాణాలకు తెగించి సేవచేశాం



కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి ఎంతోమంది రోగుల సేవ చేసాం. కుటుంబాలకు దూరంగా ఉండి వైద్య సేవలందించాం. ఈ వృత్తి నాకు ఎంతో సంతృప్తినిస్తోంది. ప్రస్తుతం నర్సాపూర్‌లో సేవలందిస్తున్నా. సాధారణ ప్రసవాలు ప్రోత్సహిస్తున్నాం.

– గౌసియా బేగం, స్టాఫ్‌నర్స్, నర్సాపూర్(జి)

వృత్తినే దైవంగా భావిస్తాం



నర్సింగ్ వృత్తి నాకు ఎంతో సంతృప్తినిస్తోంది. నైటింగెల్ ఫ్లారెన్స్ మాకు ఆదర్శం. రోగులకు సేవ చేయడమే పరమావధిగా భావిస్తా. డ్రెస్ వేసుకున్నాక పూర్తిస్థాయిలో విధుల్లో నిమగ్నమైపోతా. పని ఒత్తిడి ఎంత ఉన్నా, వృత్తినే దైవంగా భావించి సేవలందిస్తాం.

– ధనలక్ష్మి, నర్సింగ్ సూపరింటెండెంట్, జిల్లా ప్రసూతి ఆస్పత్రి

వృత్తికే అంకితం..



ఉద్యోగంలో చేరినప్పటి నుంచి వృత్తికే అంకితమయ్యా. అదనపు బాధ్యతలున్నప్పటికీ ఇబ్బంది లేకుండా సమన్వయం చేసుకుంటూ పనిచేస్తున్నా. కోవిడ్ విధుల్లో వార్డులకు ఇన్‌చార్జిగా ఉంటూ సిబ్బందిని సమన్వయం చేస్తూ పనిచేయడం ఎంతో ఆనందాన్నిచ్చింది.

– రుక్మిణి, నర్సింగ్ సూపరింటెండెంట్, ఖానాపూర్

మమతల తల్లీ...



- అమ్మ ప్రేమ అజరామరం
- పిల్లల జీవితాలు తీర్చిదిద్దే అద్భుత శిల్పి
- నేడు అంతర్జాతీయ మాతృదినోత్సవం

నిర్మల్‌ఖిల్లా: 'అమ్మ' తన ఆయుష్షును తనయుల కోసమే దారబోస్తుంది. బిడ్డలు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటుంది. మన బంగారు భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తుంది. జీవితాంతం.. పిల్లలే లోకంగా జీవిస్తుంది. అలాంటి.. 'అమ్మ'ను పూజించుకునేందుకు మే 12న మాతృదినోత్సవంగా నిర్ణయించారు. నేడు 'అంతర్జాతీయ మాతృదినోత్సవం' సందర్భంగా కథనం.



నాందేవ్‌కు అన్నం తినిపిస్తున్న తల్లి ప్రభావతి

కళ్లున్నా చూడలేని దుస్థితి

కెరమెరి మండలంలోని తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని అంతాపూర్ గ్రామ పంచాయతీ ఇంద్రానగర్ గ్రామానికి చెందిన మెండి మహదు, ప్రభావతి దంపతుల ఏకైక కుమారుడు నాందేవ్‌కు పదహారేళ్లు. చిన్ననాటి నుంచి రేచికటి ఉండేది. కానీ క్రమక్రమంగా పగలు కూడా కళ్లు కనిపించకుండా చేసింది. దీంతో తల్లి ప్రభావతే అతనికి చంటిపిల్లలకు చేయాల్సిన సపర్యలు చేస్తోంది.

అవ్వ చూపిన తోవలోనే ముందుకు...



తల్లి భూదేవితో పోలీస్ భీమేశ్

నిర్మల్ రూరల్ మండలంలోని అనంతపేటకు చెందిన యువ కవి, శిల్పి, చిత్రకారుడు పోలీస్ భీమేష్‌కు అమ్మంటే ఎనలేని ప్రేమ. తన రచనలలో అమ్మ ప్రేమను ప్రతిబింబించే విధంగా పదాలు అల్లుతాడు. చిన్నప్పటి నుంచి 'అవ్వ' అనే పదమే తన జీవన గమనాన్ని నిర్దేశించిందని వినమ్రంగా చెబుతాడు. 'అవ్వ' అనే పిలుపు లోనే మాధుర్యం ఉందంటాడు. నీతినిజాయితీగా బతికితే ఎవరికీ భయపడనవసరం లేదని,ధైర్యంగా ముందడుగేయచ్చని తనతల్లి నేర్పిందని వివరిస్తాడు. తాను రాసిన 'స్వేచ్ఛకు సంకెళ్లు' అనే కవితా సంపుటిని తల్లికి అంకితం ఇవ్వడం విశేషం. వీలుచిక్కినప్పుడల్లా తన తల్లిని రాష్ట్రంలోని పలు పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్తున్నాడు. ఇటీవల కాకతీయుల సామ్రాజ్యం ఓరు

హత్య కేసు ఛేదించిన పోలీసులు

- వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకీ షర్మిల



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ జానకీ షర్మిల వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్ కాలనీకి చెందిన అబ్దుల్ జీషాన్, గాజుల్‌పేట్ కాలనీకి చెందిన మహ్మద్ సుమైర్ ఇద్దరు స్నేహితులు. వీరు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం అబ్దుల్ జీషాన్ (23) ఒక అమ్మాయిని ప్రేమించాడు. ఆ తర్వాత కొద్ది రోజులకు వీరి మధ్య మనస్పర్ధలు రావడంతో విడిపోయారు. ఈ క్రమంలో అదే అమ్మాయిని మహ్మద్ సుమైర్ ప్రేమిస్తుండడంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. శుక్రవారం అబ్దుల్ జీషాన్ సుమైర్‌కు ఫోన్‌చేసి నీతో మాట్లాడేది ఉందని చెప్పడంతో స్థానిక మినీట్యాంకు బండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చాడు. అప్పటికే అక్కడ అబ్దుల్ జీషాన్‌తో పాటు అతని స్నేహితులు అజ్మత్, మతిన్ అక్కడ ఉన్నారు. వారంతా కలిసి మాట్లాడుకుందామని పక్కనే ఉన్న జీకే హాస్పిటల్ వెనుకకు వెళ్లారు. మేమిద్దరం పర్సనల్‌గా మాట్లాడుకునేది ఉందని చెప్పడంతో అజ్మత్, మతిన్ కొంతదూరం వెళ్లి నిలబడ్డారు. అంతలోనే మహ్మద్ సుమైర్ వెంట తెచ్చుకున్న కత్తితో జీషాన్‌ను గొంతులో, వీపుపై దాడి చేశాడు. అడ్డుగా వచ్చిన మతిన్‌పై కూడా కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలైన వీరిద్దరిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ జీషాన్ మృతి చెందాడు. మతిన్‌ను చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు తరలించారు. జీషాన్ తండ్రి అబ్దుల్ మాజీద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసిన గంటలోనే నిందితుడు మహ్మద్ సుమైర్‌ను అరెస్ట్ చేశారు. హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తం మరకలతో ఉన్న బట్టలు, ఫోన్ స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ గంగారెడ్డి, సీఐ అనిల్ కుమార్‌ను ఎస్పీ అభినందించారు.

ఆటోడ్రైవర్‌పై పలువురి దాడి



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అనిల్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఓ ఆటోడ్రైవర్‌పై పలువురు దాడి చేసిన సంఘటన చోటు చేసుకున్నట్లు పట్టణ సీఐ అనిల్ తెలిపారు. నిర్మల్ రూరల్ మండలం నిలాయిపేట్ గ్రామానికి చెందిన గుండారపు మహేందర్ ఆటో నడుపుతుంటాడు. ఆటో అడ్డా వద్ద పార్కింగ్ విషయంలో పలువురు శుక్రవారం అతనిపై దాడిచేసి గాయపరిచారు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై మహేందర్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో హత్యాయత్నం కేసు నమోదు చేసారు. దాడిలో పాల్గొన్న సైఫ్, షేక్ ఇర్ఫాన్, మొహమ్మద్ ముజామీర్, అర్బాజ్ ఖాన్, ఎండీ ఫయాజ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుండి రెండు మోటార్ సైకిళ్లు, కత్తి, నకల్ పంచ్ స్వాధీనం చేసుకున్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఆటో డ్రైవర్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట ఆటో యూనియన్ సభ్యులు నిరసన తెలిపారు. డీఎస్పీ గంగారెడ్డి వారికి చెప్పి పంపించారు. అనంతరం ఆటోలతో ర్యాలీగా జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకుని ఎస్పీకి విన్నవించారు.

ఓటు వేస్తే ఓపీ ఫ్రీ

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గుతుండడంతో నిర్మల్‌కు చెందిన ఒక డాక్టర్ వినూత్నమైన ఆలోచన చేశారు. ఓటు వేసిన వాళ్ళు సిరా చుక్క చూపిస్తే తన హాస్పిటల్‌లో ఐదు రోజుల పాటు ఫ్రీగా ఓపీ చూస్తామంటూ ప్రకటన చేశారు. జిల్లా కేంద్రంలోని ఎంకే హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ రాజశేఖర్ ఓటింగ్ శాతం పెంచేందుకు ఈ ఆలోచన చేసినట్లు తెలిపారు. ఈ నెల మే 13 నుండి 18వరకు ఓటు వేసిన ప్రతి ఒక్కరు తమ వేలిపై సిరా గుర్తు చూపించి ఓపీ సదుపాయం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సూచించారు.

కేటీఆర్‌పై చర్యలకు ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న న్యాయవాది సాయినాథ్

భైంసాటౌన్: ఇటీవల భైంసాలో రోడ్‌షో సందర్భంగా పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని భైంసాకు చెందిన న్యాయవాది తాడేవార్ సాయినాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ డి.రాజారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసులనుద్దేశించి కేటీఆర్ కించపరిచేలా వాఖ్యలు చేస్తుంటే వారించకుండా కేటీఆర్ పక్కనే ఉన్న అనుచరులపై సైతం చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు నేపథ్యంలో కేసు నమోదు విషయమై పట్టణ సీఐ డి.రాజారెడ్డి ని వివరణ కోరగా న్యాయ సలహా ఆధారంగా చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు.

మరోసారి మోదీ ప్రధాని కావాల్సిందే

- ఎంపీ సోయం బాపురావు



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపురావు

నేరడిగొండ: మరోసారి మోదీ ప్రధాని కావాల్సిందేనని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు అన్నారు. శనివారం నేరడిగొండలో ఆయన పర్యటించారు. కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌కు భారీ మెజార్టీ వచ్చేలా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోసారి మోదీ ప్రధాన మంత్రి అయితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. నాయకులు జీవీ రమణ, సరసాని మహేందర్‌రెడ్డి, భూమేష్ చారి, భీంరావు, వెంకటేష్, గంగాధర్, ధర్మపురి రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి మోదీ గ్యారంటీ

గుడిహత్నూర్: దేశంలో అన్ని విధాల అభివృద్ధి జరగాలంటే మోదీతోనే సాధ్యపడుతుందని ఎంపీ సోయం బాపురావు అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ గ్యారంటీలకు భరోసా లేదన్నారు. అబ్‌కీ బార్ చార్ సౌ పార్ నినాదంలో.. ఆదిలాబాద్ సీటు కూడా ఉందని స్పష్టం చేశారు. కమలం పువ్వుకు ఓటేసి బీజేపీని బలపర్చాలని కోరారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, మండలాధ్యక్షుడు కేంద్రే శివాజీ, వైస్ ఎంపీపీ భరత్, నాయకులు కనామే సురేష్, కేంద్రే లక్ష్మణ్, కేంద్రే కుమార్, బాలజీ, వైజునాథ్, చాటే సంభాజీ, శైలేందర్, తదితరులు ఉన్నారు.

'ఎన్నికల పేరిట బీజేపీ నేతల అక్రమ వసూళ్లు'



మాట్లాడుతున్న కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: ఎన్నికల పేరిట బీజేపీ నేతలు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేసి రూ.8 నుంచి రూ.10 కోట్లు, ఇచ్చోడకు చెందిన ఆ పార్టీ నాయకుడు రూ.4.5 కోట్లు వసూలు చేశారన్నారు. స్థానిక ఎమ్మెల్యే భయపెట్టి పేదల భూములను కబ్జా చేస్తున్నారని, వినకుంటే బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. వసూళ్లను ఎండగట్టడానికి త్వరలోనే ఒక హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ వ్యాపార భాగస్వామ్యులని, వారి తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కొడుకు, అల్లుడు రాజ్యాంగేతర శక్తులుగా మారి అక్రమంగా భూ కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. భూకబ్జాదారుల భరతం పడతామని హెచ్చరించారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్‌అడ్డి భోజారెడ్డి, నాయకులు గిమ్మ సంతోష్, భోజారెడ్డి, బండి దేవిదాస్ చారి, సుధాకర్ గౌడ్, శ్రావణ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో హిందువులపై మళ్లీ దాడులు

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



మాట్లాడుతున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్రంలో హిందువులపై మళ్లీ దాడులు మొదలయ్యాయని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. భైంసా సంఘటనకు సంబంధించి జైలులో ఉన్న హనుమాన్ మాలధారులను శనివారం నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమాన్ దీక్షలో ఉన్న స్వాములను రిమాండ్‌కు పంపించడం చూస్తుంటే హిందువులపై కాంగ్రెస్ పార్టీ ఎంత అక్కసు వెల్లగక్కుతుందో అర్థం అవుతోందన్నారు. రాముడిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్‌కు శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న సమయంలో వేరే వర్గానికి చెందిన కొందరు దుండగులు టమాటాలతో కేటీఆర్‌పై చేసిన దాడికి బాధ్యులను చేస్తూ అక్రమ కేసులు బనాయించారన్నారు. ఎన్నికలు అయిన వెంటనే ఈ విషయంపై బీజేపీ కచ్చితంగా చర్యలు తీసుకుంటుందన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఒకరిపై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్ఎస్ ఫంక్షన్ హాల్లో తన పెళ్లి రోజు వేడుకల్లో భాగంగా మద్యం పార్టీ ఇచ్చిన రవీందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విజేందర్ తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ ఫంక్షన్ హాల్లో ఎలాంటి అనుమతి లేకుండా పార్టీ ఇవ్వడంతో ఆయనపై ఎన్నికల నియామవళి ఉల్లంఘన కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఫంక్షన్ హాల్లో, ఇతర కార్యక్రమాల్లో మద్యం సేవించడం, వినియోగించడం చేయడం చట్టరీత్యా నేరమన్నారు.

చోరీకి పాల్పడిన ముగ్గురు అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని సాయిబాబా జిన్నింగ్ మిల్లులో వెయిట్ లిఫ్టింగ్ వస్తువులను దొంగలించిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. సుందరయ్యనగర్‌కు చెందిన గైక్వాడ్ గజానన్, వరలక్ష్మీనగర్‌కు చెందిన పాపు, గాంధీనగర్‌కు చెందిన మెకాస్‌లవ్ రెండు రోజుల క్రితం చోరీకి పాల్పడ్డారు. ప్రస్తుతం జిన్నింగ్ మిల్లు మూతపడి ఉండటంతో గతంలో మిల్లులో పనిచేసిన ఈ ముగ్గురు వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అనుమానం వచ్చి శనివారం మిల్లులో తనిఖీలు చేయగా మరోసారి అక్కడే దొంగతనానికి యత్నిస్తుండగా పట్టుకుని విచారించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్సై లాల్‌సింగ్, పోలీస్ సిబ్బంది నరేందర్, సుధాకర్‌రెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కుంటాల: మండలంలోని కల్లూర్ గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు ఎస్సై రజినీకాంత్ తెలిపారు. గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ వెనకాల చొక్కా విప్పి చెట్టు కింద నిద్రకు ఉపక్రమించాడు. స్థానికులు గమనించి అక్కడికి వెళ్లి చూడగా మృతి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు పసుపు రంగుచొక్క, నలుపురంగు ప్యాంటు ధరించాడు. మృతుని వయస్సు 50 నుంచి 55 వరకు ఉంటుందని, వివరాలకు 8712659535 నంబర్‌లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆస్పత్రిలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపెల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామానికి చెందిన సంకూరి సత్తయ్య (48) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం మద్యం మత్తులో గుర్తు తెలియని పురుగుల మందు తాగి కింద పడిపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా బెల్లంపల్లికి, అక్కడి నుంచి వైద్యుల సూచన మేరకు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ సదుపాయాలు లేవని వైద్య సిబ్బంది మాతశిశు కేంద్రంలో అడ్మిట్ చేసుకుని చికిత్స అందిస్తుండగా శనివారం మృతి చెందాడు. సత్తయ్యను మాతాశిశు కేంద్రానికి ఎందుకు తరలించారని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా ఇటీవల కురిసిన వర్షానికి, ఉరుములు, మెరుపులకు షార్ట్‌సర్క్యూట్‌తో వెంటిలేటర్ పాడైపోయిందని మెరుగైన వైద్యం అందించేందుకు సంబంధిత వైద్యుల పర్యవేక్షణలో మాతాశిశు కేంద్రంలోని ఐసీయూకు తరలించి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు.

సాహితీ వారధి సామల సదాశివ



నివాళులర్పిస్తున్న తెలంగాణ రచయితల వేదిక సభ్యులు

నిర్మల్‌ఖిల్లా: ఉత్తర, దక్షిణ భారతదేశ కవులు, సాహితీవేత్తలకు ప్రముఖకవి స్వర్గీయ సామల సదాశివ వారధిగా నిలిచారని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. నిర్మల్ జిల్లా తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో శనివారం సదాశివ 96వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నిర్మల్ నర్సింగ్ హోమ్‌లోగల దామెర సాహితీ క్షేత్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖకవులు డాక్టర్ దామెర రాములు, తుమ్మల దేవరావు తదితరులు మాట్లాడుతూ సదాశివ తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠీ, పార్సి, సంస్కృతం, ఆంగ్లభాషల పండితుడని, ఏడు భాషల్లో అపారమైన సాహితీ పరిజ్ఞానం కలవారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల హనుమంతు, కవులు డాక్టర్ మురళీధర్, పత్తి శివప్రసాద్, అంబటి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.